క్లుప్తంగా

నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయండి



భట్టికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకపల్లిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో సౌకర్యాలు కల్పించాలని కోరారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఇబ్రహీంపట్నం/మెట్‌పల్లి: ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్లను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎన్ని కేసులు నమోదు అయ్యాయి, ఈ రోజు ఎన్ని కేసులు నమోదు అయ్యాయి. సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. అనంతరం లాకప్ గదులు, కంప్యూటర్, రికార్డు గదులను పరిశీలించి, స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్, మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పోలీస్ కళాబృందం



పుష్పగుచ్ఛం ఇస్తున్న కళాబృందం సభ్యులు

జగిత్యాలక్రైం: నూతన పోలీస్ చట్టాలు సైబర్ నేరాలు, సామాజిక అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసు కళాబృందం సభ్యులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో టెక్నాలజీ పెరుగుతుండటంతో పాటు, సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుందని, ఈ సైబర్ నేరాల నియంత్రణకు కళాబృందం సభ్యులు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు చట్టాలు, సీసీకెమెరాల ప్రాముఖ్యత, మూఢనమ్మకాల నివారణ, డయల్ 100 ఆవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

రాయికల్: రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమయానికి ఆలూరు, వీరాపూర్,ధర్మాజీపేట, తాట్లవాయి, కట్కాపూర్, దావన్‌పల్లి, వస్తాపూర్, ఒడ్డెలింగాపూర్, కొత్తపేట, ఇటిక్యాల మీదుగా రింగ్ బస్ సౌకర్యం కల్పించాలని సోమవారం కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశ్‌యాదవ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

డీఎస్‌కు కాంగ్రెస్ నివాళి

కోరుట్ల: రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, రాజం, నాయకులు పుప్పాల ప్రభాకర్, నయీం తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో క్షుద్రపూజల కలకలం?



ఇంట్లో నుంచి బయట పోసిన మట్టి కుప్ప



భీమారంలో భయాందోళనతో గుమిగూడిన స్థానికులు

మేడిపల్లి: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో గుప్త నిధుల కోసం క్షుద్రపూజలు చేస్తున్నారనే సంఘటన భీమారం మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. భీమారం తహసీల్దార్ ఆఫీస్ సమీపంలోని ఓ ఇంట్లోకి ఇటీవల అపరిచితులు వస్తున్నారని, వివిధ రకాల పూజలు చేస్తున్నారని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం రాత్రి వేళల్లో ఓ ఇంట్లో నుంచి పొగలు రావడం, గంటల శబ్దాలు, మంత్రాల ఆర్తనాదాలు, గమనించిన స్థానికులు అసలు ఆ ఇంట్లో ఏం జరుగుతుందో అని ఆరాతీయగా, ఇంట్లో నుంచి మట్టి తవ్వుతూ రాసులుగా పోయడం గమనించి అవాక్కయ్యారు. అప్పటి నుంచి ఆ ఇంటి వ్యవహారాలపై నిఘా పెట్టిన స్థానికులు ఒరోజు మేకను, ఒరోజు పందిని తీసుకొచ్చినట్లు చూసిన స్థానికులు అసలు వాటిని ఎందుకు తీసుకువచ్చారు? బలికోసమా లేదా ఇంకా ఏదైనా పని కోసమా అని చర్చించుకుంటున్నారు. నరబలి కూడా చేశారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వరుస సంఘటనలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మూఢనమ్మకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

ప్రాథమిక విద్యే చిన్నారులకు కీలకం



మాట్లాడుతున్న సీడీపీవో వీరలక్ష్మి

రాయికల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. సోమవారం రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించి అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, పోషణ్ అభియాన్ శ్రీధర్ తదిదతరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి, రాజారాం తండా గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని తల్లులకు సూచించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోట రజిత, సంధ్య, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

బాలామృతంతో చిన్నారులకు ఆరోగ్యం

మెట్‌పల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే బాలమృతం చిన్నారుల ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమతి అన్నారు. మెట్‌పల్లి మండలం పాటిమీదితండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 0–5 ఏళ్ల పిల్లల బరువు, ఎత్తుల మేళా నిర్వహించి, బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రమీల, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మల్యాల: అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య ప్రణాళికపై మూడు రోజులపాటు నిర్వహించే అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ ఆగంతపు రవళి, సీడీపీవో నర్సింగరాణితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవళిని సన్మానించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య బోధనపై అంగన్‌వాడీ టీచర్ల సందేహాలు నివృత్తి చేస్తూ, శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆగంతపు రవళి, సీడీపీఓ నర్సింగరాణి, సూపర్‌వైజర్లు పవిత్ర, రాజశ్రీ, సుధారాణి, ఉమారాణి, మమత, మహేశ్వరి, జ్యోతి, సుభద్ర, రాధిక, లత, భాగ్య, సుజాత, స్వరూప, నీలిమ, శంకరమ్మ, లక్ష్మి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

‘రైతుభరోసా’ పథకంపై అభిప్రాయ సేకరణ



అభిప్రాయాలు సేకరిస్తున్న జిల్లా సహకార అధికారి

కోరుట్లరూరల్: రైతు భరోసా పథకంపై మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డీసీవో సత్యనారాయణ హాజరై రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసాపై సలహాలు, సూచనలు ఇవ్వాలని సహకార శాఖ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం సూచించారు. మండల కేంద్రంలో సోమవారం పెగడపల్లి, నంచర్ల సహకార సంఘాల ప్రత్యేక మహాజన సభ సమావేశాల్లో పాల్గొని మాట్లడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న రైతుబంధు పథకాన్ని రైతుభరోసాగా మార్చిందన్నారు. ఈ పథకంలో ఉన్న లోపాలు, చేయాల్సిన సవరణలు, అవలంభించాల్సిన కొత్త పద్ధతులు, లబ్ధిదా రుల ఎంపిక తదితర అంశాలపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

ఘనంగా డాక్టర్స్ డే



డాక్టర్లకు లయన్స్ క్లబ్ సభ్యుల సన్మానం

కోరుట్ల: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిదన్ చంద్ర రాయ్ కు నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలోని డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సభ్యులు, మహిళా సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ డాక్టర్ డేని పురస్కరించుకుని పీహెచ్‌సీ అధికారులు, వైద్య సిబ్బంది వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహినిను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యులకు సన్మానం

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్‌లో డాక్టర్స్ డే సందర్భంగా స్వేచ్ఛా సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌ఎంపీ వైద్యులను సన్మానించారు.

ధర్మపురి : ధర్మపురి పట్టణంలో పోస్టాఫీసు కార్యాలయంలో సోమవారం పోస్టల్ వర్కర్స్, డాక్టర్స్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధర్మపురి మండల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పోస్టల్ సిబ్బంది, వైద్య సిబ్బంది సన్మానించారు.

వైద్యులు ప్రాణప్రదాతలు

రాయికల్: వైద్యులు ప్రాణప్రదాతలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు రవి, శశికాంత్ రెడ్డి, ఉదయ్‌కుమార్, వాణి, రంజిత్‌లను సన్మానించారు కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాటిపల్లి రాంరెడ్డి, మ్యాకల రమేశ్, బత్తిని భూమయ్య, అధ్యక్షుడు మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి కట్ల నర్సయ్య,లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వందశాతం అమలు చేస్తామని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల్లో మూడు ఇప్పటికే అమలు చేశామని, మిగిలినవి త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరలోనే అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేష్, వేములు రాజేష్, లక్ష్మణ్, సుధాకర్ సింహ రాజు ప్రసాద్, సుముఖ్, మొగిలి తదితరులున్నారు.

భూనిర్వాసితులకు పరిహారం అందించాలి

వెల్గటూర్ : ముంపు గ్రామాల నిర్వాసితులకు పరిహారం అందించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం ముంపు గ్రామాల ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గత 20 ఏళ్లుగా శ్రీపాద ఎల్లంపల్లి ముంపు గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో పరిహారం అందక ఇబ్బంది పడుతున్నారని, వారికి పూర్తి పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, చెగ్యాం ఎంపీటీసీ తిరుపతి పాల్గొన్నారు.

మున్సిపల్ 2019 చట్టం రద్దు చేయాలి

జగిత్యాల: రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2019లో మున్సిపల్ పాత చట్టం స్థానంలో సవరణలు చేసి కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టినట్లు, దానిని రద్దు చేయాలని 35 వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ పురపాలక శాఖ మంత్రికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టంలోని లోసుగులను ఆసరాగా చేసుకుని కొత్తగా అవినీతికి అవకాశం ఇచ్చినట్లుందన్నారు. ఈ చట్టంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ తీసేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు.

‘చెక్కుల పంపిణీపై ఎమ్మెల్యే నిర్లక్ష్యం తగదు’

మెట్‌పల్లి: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ విషయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నిర్లక్ష్యం చూపడం తగదని కాంగ్రెస్ నాయకులు ఎర్రోళ్ల హన్మాండ్లు, వెల్ముల శ్రీనివాస్‌రావు, రైసుద్దీన్, ఖాజీ అజీం, పెంట ప్రణయ్ అన్నారు. పదిహేను రోజులుగా ఎమ్మెల్యే సమయం ఇవ్వకపోవడంతో అధికారులు చెక్కులు పంపిణీ చేయడం లేదన్నారు. ఎన్నికల కోడ్‌తో గతంలో చెక్కుల పంపిణీలో జాప్యం జరిగిందని, ప్రస్తుతం కోడ్ ముగిసినప్పటికీ ఎమ్మెల్యే తీరుతో అదే పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని స్థానిక అధికారులతో వెంటనే చెక్కులను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తామని ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఒడ్డెరకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, గైడ్లు, ఇతర సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంప్రసాద్, సంజీవ్, సచిన్, సన్నీ, బంటి, చింటు, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేటలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం 31 మంది విద్యార్థులకు మెట్‌పల్లికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లాంగ్ నోట్‌బుక్స్, షార్ట్ నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ఇప్పటివరకు 510 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చింటు రాజేశ్, నాగరాజు, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

జగిత్యాలరూరల్: జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మండలంలోని మోరపల్లిలో విద్యార్థులకు జగిత్యాలకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ ఎద్దుల శైలేందర్‌రెడ్డి ఉచితంగా దంత పరీక్షలు చేశారు. విద్యార్థులకు టూత్‌పేస్ట్, పెన్సిల్, నోట్‌బుక్స్ అందజేశారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటరమణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటారు చోరీ

రాయికల్: పట్టణంలోని ఇద్దం రాంరెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటారును గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు బాధిత రైతు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయారు.

రహదారి బాగు చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే దారి అధ్వానంగా ఉందని, రోడ్డు బాగు చేయాలని సోమవారం ప్రజావాణిలో డబుల్ బెడ్‌రూం కాలనీ వాసులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. పెట్రోల్‌బంక్ నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వరకు వచ్చే దారి గుంతలతో ప్రమాదకరంగా ఉన్నాయని, ఇళ్ల శివారులో పెద్దగా వరద ప్రవహిస్తూ, కాలనీవాసులు నడువరాని పరిస్థితి నెలకొందని, పైప్ కల్వర్టును నిర్మించాలని, గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో కృపాకర్, ఏపీఎం శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ తొడుగులకు ప్రత్యేక పూజలు

రాయికల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ తొడుగులకు సోమవారం సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నివేదిత కృష్ణారావు ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సూరమ్మ రిజర్వాయర్ మత్తడి పనులు షురూ



రిజర్వాయర్ వద్ద కొనసాగుతున్న పనులు

కథలాపూర్: మండలంలోని కలిగోట శివారులోని సూరమ్మ రిజర్వాయర్ మత్తడి పనులు పునః ప్రారంభించినట్లు నీటిపారుదలశాఖ ఏఈ కార్తీక్ సోమవారం తెలిపారు. 10 ఏళ్ల క్రితం సూరమ్మ రిజర్వాయర్ మత్తడి పనులు మధ్యలోనే ఆపేశారు. అప్పటి నుంచి వాటి గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. కాంట్రాక్టర్ మత్తడి పనులు పునఃప్రారంభించడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో రిజర్వాయర్‌లో నీళ్లు చేరితే మత్తడి పనులకు ఆటంకం కలిగే అవకాశాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వీలైనంతా త్వరగా మత్తడి పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఫీజులు నియంత్రించాలని ఏబీవీపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు అమ్మడంతో పాటు, హాస్టళ్లలో ఇష్టానుసారంగా కుళ్లిన ఆహార పదార్థాలు పెడుతున్నారని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మల్యాల రాకేశ్, నందు, రాజు, బాను, విష్ణు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో...

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భార్గవ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని ఆందోళన

మెట్‌పల్లి: నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు సోమవారం ఓ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారన్నారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారుతి, శశి, లోకేష్, రంజిత్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలి



వైద్యశిబిరం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జగిత్యాల: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటిచూపు మందగించిన వృద్ధులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాటిపాముల వినోద్‌కుమార్ సుదర్శన్, సురేశ్‌కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

జిల్లా కేంద్రంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో చెత్త పేరుకుపోయిన పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులందరూ వెంటనే డ్రెయినేజీలు, మురికి కాలువలు తీయాలని, ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట శానిటేషన్ అధికారులున్నారు.

ప్రతి మంగళవారం ప్రజాదర్బార్

జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రతి మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి తెలిపారు. ప్రజలు ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘అడ్లూరి’ సహకారంతో మరింత అభివృద్ధి



ఆత్మీయ సమ్మేళనంలో సభ్యులు

బుగ్గారం: స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ వంశీకృష్ణ సహకారంతో రానున్న రోజుల్లో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని జెడ్పీటీ బాదినేని రాజేందర్ అన్నారు. మండల పరిషత్ ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఎంపీటీసీలు,వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. బుగ్గారం జెడ్పీటీసీ రాజేందర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండలంలోని అనేక సమస్యలకు పరిష్కారాలు చూపామన్నారు. రానున్న రోజుల్లో తాము పదవిలో ఉన్నా లేకున్నా మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జెడ్పీటీసీ రాజేందర్,ఎంపీపీ రాజమణి ఆధ్వర్యంలో అధికారులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లను సన్మానించి జ్ఞాపికలు అందించారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో పెద్దమ్మతల్లి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనాలతో పెద్దమ్మతల్లి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చి దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళ ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవతను పూజించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కోరుట్ల: స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో భాగంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం సఫాయి అప్నావో బీమారి బగావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈసీ మెటీరియల్, పోస్టర్లను కమిషనర్ ఆవిష్కరించారు. జులై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. పట్టణంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు శుభ్ర పరచటమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు గజానంద్, శివకుమార్,ప్రవీణ్, మహేష్, పాల్గొన్నారు.

నేడు మల్యాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మల్యాల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఆగంతపు రవళి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నామని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రేపు పెగడపల్లి మండల ప్రత్యేక సమావేశం

పెగడపల్లి:మండల ప్రత్యేక సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

వీహెచ్‌పీ నూతన కార్యవర్గం నియామకం

జగిత్యాలటౌన్: విశ్వహిందూ పరిషత్ జగిత్యాల నగర కార్యదర్శిగా ఎదురుగట్ల పరంధాం, సహ కార్యదర్శిగా నీలగిరి వికాస్‌రావులను నియమించినట్లు వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి ఘనపురం రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు సేవా ప్రముఖ్‌గా ఎలుగందుల రాజేంద్రప్రసాద్, మందిర అర్చక పురోహిత విభాగం ప్రముఖ్‌గా రాచర్ల హరిక్రిష్ణవర్మ, ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ అనుపురం శ్రీధర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో సోమవారం పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఆడెపు వెంకటేష్, కోశాధికారిగా ఆడెపు మల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.